## యువతిపై సామూహిక అఘాయిత్యం

**కాబోయే భర్త ఎదుటే దారుణం**

భువనేశ్వర్: బీజేపీ పాలిత ఒడిశాలోని ఫతేగఢ్‌లో గత ఆదివారం దారుణం జరిగింది. ఒక యువతిపై ఆమెకు కాబోయే భర్త ముందే కొందరు లైంగిక దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 20న సాయంత్రం బాధితులిద్దరూ రామాలయం నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ముగ్గురు యువకులు వారిని అడ్డుకున్నారు. వారిద్దరినీ సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి, యువకుడిని కత్తితో బెదిరించి, అతడి సమక్షంలోనే ఆ యువతి (21)పై లైంగిక దాడి చేశారు. ఈ దారుణాన్ని మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించి, సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

## స్వదేశాలకు అమెరికా అక్రమ నివాసితులు

**ఈ నెల 22న భారతీయుల తరలింపు**

వాషింగ్టన్, అక్టోబర్ 26: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను ఆ దేశం వెనక్కి పంపింది. ఈ నెల 22న ప్రత్యేక విమానం ద్వారా వారిని భారత్‌కు పంపేశామని, నరేంద్ర మోదీ ప్రభుత్వ సహకారంతో ఈ చర్య చేపట్టామని అమెరికా ఆంతరంగిక భద్రతా శాఖ (డీహెచ్‌ఎస్) డీహెచ్‌ఎస్ సీనియర్ అధికారి క్రిస్టీ ఏ కనెగాల్లో శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికా నుంచి 1.60 లక్షల మందికి పైగా అక్రమ వలసదారులను వెనక్కి పంపామని, భారత్ సహా 145 దేశాలకు చెందిన ఆ వలసదారులను 495కు పైగా ప్రత్యేక విమానాల్లో తరలించామని డీహెచ్‌ఎస్ తెలిపింది.

## నకిలీ బాంబు బెదిరింపులపై చర్యలు చేపట్టండి

**సామాజిక మాధ్యమాలకు కేంద్రం ఆదేశం**

న్యూఢిల్లీ: విమానయాన రంగాన్ని నకిలీ బాంబు బెదిరింపులు కుదిపేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సామాజిక మాధ్యమాలను హెచ్చరించింది. ఐటీ చట్టం ప్రకారం నేరం జరగకుండా నిరోధించేందుకు చేపట్టాల్సిన సమంజసమైన చర్యలను చేపట్టాలని ఆదేశించింది. ఈ చర్యలను చేపట్టకపోతే, ఈ చట్టం ప్రకారం మధ్యవర్తిత్వ వేదికలుగా పొందుతున్న రక్షణ వర్తించదని స్పష్టం చేసింది. నకిలీ బాంబు బెదిరింపుల కారణంగా విమాన ప్రయాణికులు, భద్రతా సంస్థలు ప్రభావితమవుతున్నాయని తెలిపింది. ఫార్వార్డింగ్, రీ షేరింగ్, రీ పోస్టింగ్, రీ ట్వీటింగ్ ఆప్షన్ల వల్ల నకిలీ బాంబు బెదిరింపుల వ్యాప్తిని నియంత్రించే పరిస్థితి లేదని తెలిపింది. ఐటీ చట్టం, 2000; ఐటీ రూల్స్, 2021 ప్రకారం ప్రజా శాంతిభద్రతలపై ప్రభావం చూపించే తప్పుడు సమాచారాన్ని తొలగించాలని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆదేశించింది. శనివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో పది హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి.

**అందరి దృష్టిలో పడాలని బెదిరించి అరెస్టయ్యాడు**

ఢిల్లీ నుంచి బయల్దేరాల్సిన ఓ విమానానికి శుక్ర, శనివారాల్లో వచ్చిన రెండు నకిలీ బాంబు బెదిరింపుల కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ ఉష రంగ్నానీ మాట్లాడుతూ ఢిల్లీలోని ఉత్తమ్ నగర్‌కు చెందిన శుభం ఉపాధ్యాయ్ (25) టీవీలో బాంబు బెదిరింపుల గురించి చూసి, అందరి దృష్టిలో పడాలనే ఉద్దేశంతో ఈ-మెయిల్ ద్వారా నకిలీ బాంబు బెదిరింపులు పంపించాడని తెలిపారు.

## జైల్లో బిష్ణోయ్ ఇంటర్వ్యూకి సహకారం

**ఏడుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు**

చండీగఢ్: పోలీసు కస్టడీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ టీవీ ఇంటర్వ్యూ ఇచ్చేందుకు అవకాశం ఇచ్చిన ఇద్దరు డీఎస్పీలు సహా ఏడుగురు పోలీసు అధికారులను పంజాబ్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. 2022 సెప్టెంబరు 3, 4 తేదీల్లో పోలీస్ కస్టడీలో ఉండగా లారెన్స్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఓ ప్రైవేట్ టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చినట్టు, ఈ ఇంటర్వ్యూ రెండు భాగాలుగా గత ఏడాది మార్చిలో ప్రసారమైనట్టు సిట్ ధ్రువీకరించింది. దీంతో పంజాబ్ హోం శాఖ కార్యదర్శి గుర్‌కిరత్ కిర్పాల్ సింగ్ ఈ నెల 25 రాత్రి ఈ అధికారులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

# ప్రతీకారం ప్రజ్వరిల్లింది

- ఇరాన్‌పై 100 విమానాలతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- క్షిపణి కేంద్రాలు, సైనిక స్థావరాలు లక్ష్యంగా దాడి
- నలుగురు మృతి.. భారీ మూల్యం తప్పదన్న ఇరాన్

జెరూసలేం, అక్టోబర్ 26: ప్రతీకార దాడులు చేస్తాం.. ఇంతకు ఇంతా బదులు చెప్తాం.. అంటూ గత కొద్ది రోజులుగా ప్రకటనలు చేస్తూ వచ్చిన ఇజ్రాయెల్ అన్నంత పని చేసింది. తమపై ఈ నెలలో ఇరాన్ జరిపిన క్షిపణి దాడులకు ఇజ్రాయెల్ ప్రతీకార దాడులతో బదులు తీర్చుకుంది. శనివారం తెల్లవారుజామున ఆ దేశ స్థానిక స్థావరాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ వాయుసేన దాడికి దిగింది. ఈ దాడులతో ఇద్దరు సైనికులు సహా నలుగురు మృతి చెందినట్టు ఇరాన్ తెలిపింది. తమ క్షిపణి, డ్రోన్ల తయారీ కేంద్రాలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, ఇతర సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రతీకార దాడి జరిపిందని, దీనికి ఆ దేశం భారీ మూల్యం చెల్లించక తప్పదని ఇరాన్ హెచ్చరించింది. రాజధాని టెహ్రాన్‌తో పాటు ఇలాం, ఖుజెస్థాన్ ప్రాంతాల్లోని సైనిక స్థావరాలు ఇతర ప్రాంతాలు లక్ష్యంగా దాడులు జరిగాయని, నష్టం పరిమితంగానే ఉందని తెలిపింది. తమ విమాన సైనిక వ్యవస్థను యాక్టివేట్ చేశామని, పలు ఇజ్రాయెల్ రాకెట్లను కూల్చి వేశామని ఇరాన్ సైన్యం తెలిపింది. కాగా, ముందు జాగ్రత్త చర్యగా తమ దేశ గగనతలాలను మూసివేస్తున్నట్టు ఇరాన్, ఇరాక్, సిరియాలు ప్రకటించాయి. టెహ్రాన్‌లో శనివారం భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్టు ఇరాన్‌కు చెందిన టీవీ నిర్ధారించింది. ఇరాన్‌పై దాడి జరగడానికి కొద్ది సేపు ముందే దాడి గురించి వైట్ హౌస్ వర్గాలు గుర్తించినట్టు ఫాక్స్ న్యూస్ తెలిపింది.

**ఇరాన్ మూల్యం చెల్లించుకుంది**

అక్టోబర్ 1న ఇరాన్ 100కు పైగా క్షిపణులతో తమ దేశంపై జరిపిన దాడికి ప్రతీకారంగానే ప్రతి దాడి చేసినట్టు ఇజ్రాయెల్ మిలిటరీ(ఐడీఎఫ్) తెలిపింది. తమపై భూతలం నుంచి వాయు మార్గంలో వెళ్లే క్షిపణుల ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని తెలిపింది. 100 విమానాలతో 20 టార్గెట్లపై తాము జరిపిన దాడి ముగిసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే చమురు కేంద్రాలపై దాడి గురించి ఐడీఎఫ్ ఎలాంటి ప్రకటన చేయలేదు. 'ఇప్పటివరకు ఇరాన్ మా దేశంపై ప్రత్యక్షంగా దాడి చేసింది. ఆ దాడిలో పౌరులను కూడా లక్ష్యంగా చేసుకుంది. దానికి ఇప్పుడు ఆ దేశం మూల్యం చెల్లించుకుంది' అని ఇజ్రాయెల్ మిలిటరీ అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగరీ ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. తమ పని తాము పూర్తి చేశామని.. ఇక దీనిపై ఇరానే స్పందించాలని ఆయన అన్నారు. 1980 నుంచి నిరంతరం ఇరు దేశాల మధ్య ఘర్షణ కొనసాగుతున్నది.





ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ యుద్ధ విమానం

అయితే అప్పటి నుంచి నిత్యం కాల్పులను ఎదుర్కొంటున్నప్పటికీ ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఇలా బహిరంగంగా దాడి చేయడం ఇదే తొలి సారి. కాగా, ఇరాన్‌పై చేసిన తాజా దాడి 1981లో ఇరాక్‌పై ఇజ్రాయెల్ చేసిన 'ఆపరేషన్ ఒపేరా'ను గుర్తుకు తెచ్చింది. ఇజ్రాయెల్ అప్పుడు కూడా వైమానిక దాడిలో ఇరాక్‌లోని ఒసిరాక్ న్యూక్లియర్ రియాక్టర్‌ను ధ్వంసం చేసింది. శత్రు దేశం రాడార్లకు దొరక్కుండా ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు ఆ దేశంలోకి చొరబడి విజయవంతంగా దాడి చేసి సురక్షితంగా వెనక్కి వచ్చాయి.

**ఖండించిన గల్ఫ్ దేశాలు**

ఇజ్రాయెల్‌పై దాడులను సౌదీ అరేబియా ఖండించింది. ప్రజల భద్రతకు భంగం కలిగించే, స్థిరత్వాన్ని బెదిరించే ఇజ్రాయెల్ చర్యను తప్పు బట్టింది. ఈ ప్రాంతంలోని సంఘర్షణ తీవ్రతను తిరస్కరించేందుకు తాము దృఢమైన వైఖరితో ఉన్నట్టు ఆ దేశ విదేశాంగ శాఖ ఎక్స్‌లో పేర్కొంది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు, అస్థిరతను తగ్గించేందుకు అంతర్జాతీయ వర్గాలు, పలుకుబడి ఉన్న పార్టీలు తగిన పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేసింది. కాగా, గాజా పోరుకు అంతం పలకడానికి మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ ఈ తీవ్ర చర్యల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది.

ఇజ్రాయెల్ చర్య ప్రాంతీయ భద్రత, సుస్థిరతపై ప్రభావం చూపుతుందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తెలిపింది. ఇజ్రాయెల్ దాడి హింసకు మరింత ఆజ్యం పోయడమే కాక, శాంతి చర్చల ప్రయత్నాలను దిగజారుస్తుందని ఇరాన్, పశ్చిమ దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేస్తున్న ఒమన్ పేర్కొంది. ఈ ప్రాంత భద్రతను ఇజ్రాయెల్ ప్రమాదంలోకి నెట్టిందని కువైట్ విదేశాంగ శాఖ తెలిపింది.

**3 దేశాల గగన తలాల మూసివేత**

కాగా, ఈ పరిణామాలతో ఇరాన్, సిరియా, ఇరాక్ దేశాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్టు ప్రకటించాయి. ఫ్లైట్ రాడర్ 24 వెబ్‌సైట్ కథనం ప్రకారం ఈ మూడు దేశాల ఆకాశ మార్గాల మీదుగా ఎలాంటి వైమానిక రాకపోకలను జరపనివ్వరు. కాగా, తమపై దాడుల అనంతరం దేశంలో విమానాల రాకపోకలపై విధించిన నిషేధాన్ని త్వరలో పునరుద్ధరిస్తున్నట్టు ఇరాన్ తెలిపింది.

**పోలీస్ కాన్వాయ్‌పై దాడి.. 10 మంది అధికారుల మృతి**

ఇరాన్ పోలీస్ కాన్వాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు శనివారం జరిపిన దాడిలో 10 మంది అధికారులు హతమయ్యారు. టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 1200 కి.మీ దూరంలోని దక్షిణ ప్రావిన్స్‌లోని సిస్తాన్, బెలూచెస్తాన్‌లో ఈ దాడి జరిగింది. ఈ దాడికి పాల్పడింది ఎవరో ఇంతవరకు వెల్లడించపోయినప్పటికీ ఇరాన్, అఫ్గాన్, పాక్‌లను వ్యతిరేకించే హల్వాష్ అనే గ్రూప్ దీనికి సంబంధించిన ఫొటో, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది.

### చర్చలు, దౌత్యం ద్వారానే సమస్యకు పరిష్కారం

పశ్చిమాసియాలో రోజురోజుకు పెరుగుతున్న ఉద్రిక్తత, అశాంతిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో అన్ని వర్గాలు సంయమనం పాటించాలని, దౌత్య, చర్చల మార్గం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో కోరింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఏ ఒక్కరికీ ప్రయోజనాన్ని చేకూర్చవని, పశ్చిమాసియా, దానికి సంబంధించిన దేశాల్లో శాంతి, సుస్థిరతలపై తీవ్ర ప్రభావం పడుతుందని, పైగా అమాయక పౌరులు, బందీలు దీని కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది.

### దాడిపై స్పందించ వద్దు: బ్రిటన్ ప్రధాని

ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ ఎంతమాత్రం స్పందించరాదని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. కామన్‌వెల్త్ శిఖరాగ్ర సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 'ఇరాన్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉందని మనం స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. కానీ, సంయమనం చూపాలని గట్టిగా చెబుతూ అన్ని వైపులా విజ్ఞప్తి చేస్తున్నాను. అందుకే ఇజ్రాయెల్ దాడిపై ఇరాన్ స్పందించకూడదని నేను స్పష్టంగా చెబుతున్నాను' అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ జరిపిన దాడిని హమాస్ ఖండించింది. 'ఇది సార్వభౌమాధికార కఠిన ఉల్లంఘన' అని వ్యాఖ్యానించింది.

## వక్ఫ్ భూములు లాక్కోవడమే కేంద్రం లక్ష్యం

- ప్రాణాలు అర్పించైనా వక్ఫ్ బిల్లును అడ్డుకుంటాం
- ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు సైఫుల్లా



కాన్పూర్, అక్టోబర్ 26: వక్ఫ్ భూములు లాక్కోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసమే వక్ఫ్ బిల్లును తీసుకొచ్చిందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా ఆరోపించారు. కాన్పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వక్ఫ్ బిల్లుపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇది మనకు జీవన్మరణ సమస్య. మనం ఎట్టి పరిస్థితుల్లో ఈ బిల్లును అడ్డుకోవాలి. ఇందుకోసం దేశంలోని జైళ్లు ముస్లింలతో నిండిపోతాయి. అవసరమైతే మా ప్రాణాలు ఇవ్వడానికి కూడా వెనుకాడం. ఒకవేళ వక్ఫ్ బోర్డుల నిర్వహణ ముస్లిమేతరుల చేతుల్లో ఉంటే వారు మసీదులు, శ్మశాన వాటికల విషయంలో సానుభూతితో ఉంటారా? ఇది చాలా ప్రమాదకరమైన చట్టం. దీని వల్ల మీ భూములు మీ నుంచి లాక్కుంటారు. తమిళనాడు, ఏపీలో కలిపి దేవాలయాలకు 10 లక్షల ఎకరాల భూమి ఉంది. ముస్లింలకు దేశమంతా కలిపి ఆరు లక్షల ఎకరాల వక్ఫ్ భూమి ఉంటే సమస్యేంటి?' అని సైఫుల్లా వ్యాఖ్యానించారు. కోర్టుకు డాక్యుమెంట్లు అందించకుండా, కేసు ఓడిపోయేలా వక్ఫ్ బోర్డులోని కొందరు సభ్యులపై కేంద్రం ఒత్తిడి తెస్తున్నదని ఆయన ఆరోపించారు. కాగా, రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో ముస్లిం మహిళ, ముస్లిమేతర వ్యక్తిని చేర్చాలనే ప్రతిపాదనలతో కేంద్రం కొత్త బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాల అభ్యంతరాలతో ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) సమీక్షకు పంపించింది.



## తల్లి పాలు పొందడం పసి బిడ్డ హక్కు

**చైల్డ్ వెల్ఫేర్ కమిటీపై కేరళ హైకోర్టు ఆగ్రహం**

తిరువనంతపురం: పసిబిడ్డను తల్లి నుంచి వేరు చేస్తారా? అంటూ కేరళ హైకోర్టు ఆ రాష్ట్రంలోని 'చైల్డ్ వెల్ఫేర్ కమిటీ'పై ఆగ్రహం వ్యక్తం చేసింది. పసిబిడ్డకు తల్లి పాలు పట్టడం, ఆ బిడ్డ తల్లి పాలను పొందడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కుకు సంబంధించిన అంశమని హైకోర్టు వ్యాఖ్యానించింది. పసిబిడ్డను తల్లికి అప్పగిస్తూ జస్టిస్ వీజీ అరుణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఓ కేసులో శుక్రవారం తీర్పు వెలువరించింది. పసిపాప సంరక్షణను తండ్రికి అప్పగిస్తూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేసింది. సీడబ్ల్యూసీ నిర్ణయం వల్ల ఓ పసిబిడ్డ తల్లికి దూరమవ్వటం చాలా బాధాకరమని న్యాయమూర్తి అన్నారు.



## ఫిలిప్పీన్స్‌లో తుఫాను బీభత్సం

**115 మంది మృతి.. పలువురు గల్లంతు**

తాలిసే: ఫిలిప్పీన్స్‌లో ఉష్ణ మండల తుఫాను ట్రామీ బీభత్సం సృష్టించింది. దీని కారణంగా భారీ వరదలు రావడమే కాక, పలు చోట్ల కొండ చరియలు విరిగిపడటంతో 115 మందికి మరణించగా, వందలాది మంది గల్లంతయ్యారు. పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన బాధితులను రక్షించేందుకు విపత్తుల నివారణ బృందాలు ప్రయత్నిస్తున్నట్టు అధ్యక్షుడు మార్కోస్ శనివారం తెలిపారు. ఫిలిప్పీన్స్ వాయువ్య ప్రాంతాన్ని శుక్రవారం ట్రామీ బలంగా తాకడంతో 81 మంది మరణించగా, 34 మంది గల్లంతయ్యారు. మనీలా ఆగ్నేయ ప్రాంతంలో తుఫాన్, భారీ వర్షాలకు పలువురు మరణించారు.

## సర్జరీ విఫలమైతే నేరుగా వైద్యుడిని బాధ్యుడిని చేయలేం

- ప్రతి కేసులో రోగి సంతృప్త స్థాయిలో మెరుగవ్వాలని లేదు
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: చికిత్సకు, సర్జరీకి రోగి సానుకూలంగా స్పందించకపోయినా, శస్త్ర చికిత్స విఫలమైనా వైద్యపరమైన నిర్లక్ష్యం చూపారని వైద్యుడిని నేరుగా బాధ్యుడిని చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తనకు నిర్లక్ష్యంగా వైద్యం అందించారని జస్విందర్ సింగ్ అనే వ్యక్తి ఛండీగఢ్‌కు చెందిన డాక్టర్ నీరజ్ సుద్‌పై జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్సీడీఆర్సీ)ను ఆశ్రయించారు. దీంతో బాధితుడికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని వైద్యుడిని కమిషన్ ఆదేశించింది. మరో రూ.50 వేల జరిమానా విధించింది. ఈ ఆదేశాలను వైద్యుడు నీరజ్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం విచారించింది. 'వైద్యుడు తన నైపుణ్యాన్ని సరిగ్గా వినియోగించడంలో, విధులు నిర్వర్తించడంలో విఫలమయ్యాడనే కచ్చితమైన ఆధారం లేనిదే వైద్య పరమైన



నిర్లక్ష్యానికి బాధ్యుడిని చేయలేం. వైద్యుడి నిర్లక్ష్యాన్ని నిరూపించేలా ఆధారాలు ఉండాలి. కేవలం సరైన చికిత్స ఇవ్వలేదనడం, చికిత్సకు సంబంధించి వైద్యుడి నిర్ణయ లోపం వంటివి వైద్య నిర్లక్ష్యాన్ని నిరూపించేందుకు ఆధారాలుగా సరిపోవు. సర్జరీకి, చికిత్సకు సానుకూలంగా స్పందించలేదనో, సర్జరీ విఫలమైందనో వైద్యుడిని నేరుగా బాధ్యుడిని చేయలేం. సర్జరీ, చికిత్స తీసుకున్న ప్రతి కేసులో రోగి పరిస్థితి అతడి సంతృప్త స్థాయిలో మెరుగవ్వాలని లేదు' అని కోర్టు స్పష్టం చేసింది. వైద్యుడి నిర్లక్ష్యానికి సరైన ఆధారాలు చూపలేదని పేర్కొంటూ ఎన్సీడీఆర్సీ ఆదేశాలను కోర్టు కొట్టివేసింది.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఏడేండ్ల జైలు

**ఇనుప ఖనిజం అక్రమ రవాణా కేసులో అరెస్ట్**

బెంగళూరు: దొంగతనం, ఇనుప ఖనిజం అక్రమ రవాణా కేసులో కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ కృష్ణ సెయిల్, మరో ఆరుగురికి ప్రత్యేక కోర్టు ఏడేండ్ల జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు విధించింది. దీంతో ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. న్యాయస్థానం జైలు శిక్ష విధించినందున సతీశ్‌ను వెంటనే ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని అసెంబ్లీ స్పీకర్‌కు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కార్వార్ శాసనసభ్యుడిగా ఉన్న సతీశ్ కృష్ణ శ్రీ మల్లికార్జున షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీగా చోరీ, మోసం, నేరపూరిత కుట్రలకు పాల్పడినట్టు మోపిన అభియోగాలు రుజువు కావడంతో ఆయనతో పాటు మరో ఆరుగురికి జైలు శిక్ష, రూ.6 కోట్ల జరిమానా విధిస్తూ న్యాయస్థానం గురువారం తీర్పు చెప్పింది.


### 'మహా' బరిలో లేము: ఆప్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయబోదని ఆప్ నేత సంజయ్ సింగ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) విజయం కోసం అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని ఆప్ శనివారం ప్రకటించింది. ఈ ఎన్నికల్లో కూటమిలోని శివసేన (యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ) నేతలు కేజ్రీవాల్‌ను ప్రచారం కోసం సంప్రదించారని ఆప్ వర్గాలు తెలిపాయి. కేజ్రీవాల్ మహారాష్ట్రలో ఎంవీఏ అభ్యర్థుల కోసం, జార్ఖండ్‌లో జేఎంఎం అభ్యర్థుల కోసం ప్రచారం చేస్తారని వెల్లడించాయి.

## యమునలో మునకేసి.. అస్వస్థతకు గురై..

- బెడిసి కొట్టిన బీజేపీ నేత నిరసన
- అనారోగ్యంతో దవాఖాన పాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: కాలుష్య కాసారంగా మారిన యమున నదిలో మునకేసిన ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ అస్వస్థతకు గురయ్యారు. ఆప్‌పై నిరసనగా చేపట్టిన 'యమునా స్నానం' ఆయనను దవాఖాన పాలు చేసింది. ఒంటిపై దురదలు, శ్వాసలో ఇబ్బంది సమస్యలతో ఆయన శనివారం ఢిల్లీలోని ఓ నర్సింగ్ హోమ్‌లో చేరారు. యమున నది ప్రక్షాళన విషయంలో ఆప్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఆ నది శుద్ధికి కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ గురువారం ఆయన యమునలో స్నానం చేశారు. స్నానం చేసిన కొద్ది సేపటికే ఆయన ఒంటిపై దద్దుర్లు రావడంతో పాటు ఊపిరి తీసుకోవడంలో స్వల్పంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఆయన దవాఖానకు వెళ్లగా వారు మూడు రోజులకు మందులు ఇచ్చారు. అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో ఆయన శనివారం అదే దవాఖానలో చేరారు. అయితే



ఇలాంటి నాటకాలతో యమున నది ప్రక్షాళన కాదని సచ్‌దేవ్ తెలుసుకోవాలని ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ వ్యాఖ్యానించారు.

**యమున కాలుష్యంపై జోరుగా రాజకీయాలు**

యమునా నది కాలుష్యం ఇప్పటికే బీజేపీ, ఆప్ పరస్పరం రాజకీయ విమర్శలు చేసుకుంటున్నాయి. ఇటీవల విష పూరితమైన నురగ నదీ జలాలపై పొరగా ఏర్పడటంతో అవి మరింత అధికమయ్యాయి. యమునా నది అలా కావడానికి కారణం బీజేపీయేనని, ఆ పార్టీ పాలిత యూపీ, హర్యానాల్లోని వందలాది పరిశ్రమల్లోని శుద్ధి చేయని మిలియన్ గ్యాలన్ల పారిశ్రామిక వ్యర్థాలు డ్రైన్ల ద్వారా యమునలో కలవడం వల్లే పూర్తిగా కలుషితం అయినట్టు ఆప్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది.

## బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ల మధ్య చీలిక

**బెదిరించారనే సాకుతో బహిష్కరించారన్న ఓ వర్గం**

కోల్‌కతా: దేశాన్ని కుదిపేసిన వైద్య విద్యార్థిని హత్యాచారంపై నిరసన తెలుపుతున్న పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్ల మధ్య చీలికలు వచ్చాయి. హత్యాచారం, హత్యకు గురైన ఆర్‌జీ కర్ హాస్పిటల్ ట్రైనీ డాక్టర్ (31)కు న్యాయం చేయాలనే ప్రధాన డిమాండ్ నుంచి పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ (డబ్ల్యూబీజేడీఎఫ్) పక్కకు తప్పుకుందని కొందరు జూనియర్ డాక్టర్లు ఆరోపిస్తున్నారు. వీరు కొత్తగా పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అనే సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో బెదిరింపుల సంస్కృతిలో భాగస్వాములయ్యారనే సాకుతో తమలో చాలా మందిని బహిష్కరించారని వీరు ఆరోపించారు. తమను రెసిడెంట్ డాక్టర్ల సంఘం, డబ్ల్యూజేడీఎఫ్ బెదిరిస్తున్నాయని చెప్పారు.

## కీవ్‌పై రష్యా డ్రోన్ దాడులు

**రాత్రంతా మోగిన సైరన్లు.. ఆందోళనలో ప్రజలు**

కీవ్, అక్టోబర్ 26: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా విరుచుకుపడింది. శుక్రవారం రాత్రి డ్రోన్లతో దాడికి దిగింది. ఏడున్నర గంటల పాటు దాడులు జరగడంతో నగరమంతా సైరన్లు మోగాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పలు రష్యా డ్రోన్లను కూల్చేసినట్టు ఉక్రెయిన్ ప్రకటించింది. కాగా, నగరంలోని పశ్చిమ ప్రాంతంలో ఓ 25 అంతస్థుల భవనంపై రష్యా డ్రోన్ దాడి చేసిందని, ఈ దాడిలో 15 ఏండ్ల బాలిక మరణించిందని మేయర్ విటలి క్లిట్స్‌కో తెలిపారు. భవనం నుంచి 100 మందిని రక్షించినట్టు చెప్పారు. మరోవైపు మధ్య ఉక్రెయిన్‌లోని డ్నిప్రో నగరంపై రష్యా క్షిపణి దాడి చేసింది. ఈ దాడిలో 14 ఏండ్ల బాలుడితో పాటు మరో ముగ్గురు మరణించారు. 20 మంది వరకు గాయపడ్డారు. దక్షిణ ఖెర్సన్ ప్రాంతంతో పాటు కీవ్ ప్రావిన్స్‌లోని మరికొన్ని ప్రాంతాలపైనా రష్యా దాడులు జరిపింది. ఈ దాడుల్లో ముగ్గురు మరణించగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు.

**రష్యా డబ్బులతో ఉక్రెయిన్‌కు రుణాలు**

రష్యాతో యుద్ధంలో తీవ్రంగా దెబ్బతిన్న ఉక్రెయిన్‌ను ఆదుకునేందుకు సుమారు రూ.4.20 లక్షల కోట్ల(50 బిలియన్ డాలర్లు)




రుణం ఇవ్వాలని జీ7 దేశాధినేతలు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో 20 బిలియన్ డాలర్లు అమెరికా అందించనుండగా, మిగతా 30 బిలియన్ డాలర్ల రుణాలను ఐరోపా, యూకే, కెనడా, జపాన్ అందిస్తాయి. ఈ ఏడాది చివరి నాటికి ఈ రుణాన్ని అందించడం ప్రారంభించాలని నిర్ణయించారు. కాగా, ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రారంభించగానే తమ దేశాల్లోని రష్యా ఆస్తులను జీ7 దేశాలు స్వాధీనం చేసుకున్నాయి. వాటిపై వచ్చిన లాభాలను సైతం ఉక్రెయిన్‌కు అందించాలని ఆయా దేశాలు నిర్ణయించాయి.

## ట్రంప్‌కు మద్దతుగా | ఓటేసినందుకు 8 కోట్లు

- ఇద్దరు రిజిస్టర్డ్ ఓటర్లకు మస్క్ నజరానా
- న్యాయ శాఖ హెచ్చరికలు బేఖాతరు

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలుపు కోసం గట్టిగా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆయన ట్రంప్‌నకు అనుకూల సూపర్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ)ని నిర్వహిస్తున్నారు. దీని ద్వారా మిచిగన్, విస్కాన్‌సిన్‌లలో రిజిస్టర్డ్ ఓటర్లకు స్వీప్‌స్టేక్స్ (లాటరీ) పథకాన్ని గత శనివారం ప్రారంభించారు. ఈ పీఏసీ



ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణలకు మద్దతుగా సంతకం చేసే ఓటర్లకు బహుమతులు ఇస్తామని ప్రకటించారు. ప్రతి రోజూ విజేతలను ప్రకటిస్తామని చెప్పినప్పటికీ, బుధవారం వరకు ఆ పని చేయలేదు. కానీ గురువారం ఈ రెండు రాష్ట్రాలకు చెందిన ఒక్కొక్క రిజిస్టర్డ్ ఓటరుకు 1 మిలియన్ డాలర్ల(సుమారు రూ.8 కోట్లు) చొప్పున బహుమతిని ఎక్స్ వేదికగా ఈ పీఏసీ ప్రకటించింది. ఈ డబ్బును ఓటర్ల రిజిస్ట్రేషన్ కోసం చట్టవిరుద్ధంగా ఇచ్చే ప్రోత్సాహకంగా పరిగణించే అవకాశం ఉందని న్యాయశాఖ హెచ్చరించినప్పటికీ మస్క్ సారథ్యంలోని పీఏసీ పట్టించుకోలేదు. అయితే మస్క్ ఈ విమర్శలను తోసిపుచ్చారు. రిపబ్లికన్లు ఓటర్లుగా నమోదు చేయించుకునేలా ప్రోత్సహించడానికి తాను సొమ్ము చెల్లిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలను ఖండించారు. తమ స్వీప్‌స్టేక్స్‌లో విజేతలు ఓటు వేయాల్సిన అవసరం లేదన్నారు.

## మృత్యువును పసిగట్టే కాలిక్యులేటర్

**బ్రిటన్‌లో వినియోగానికి సిద్ధమవుతున్న హాస్పిటళ్లు**

లండన్, అక్టోబర్ 26: మరణాన్ని ముందుగానే అంచనా వేసే 'సూపర్ హ్యూమన్ ఏఐ డెత్ కాలిక్యులేటర్'ను బ్రిటన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది సింగిల్ ఎలక్ట్రోకార్డియోగ్రామ్ (ఈసీజీ) టెస్ట్ సాయంతో గుండె విద్యుత్తు కార్యకలాపాలను (ఎలక్ట్రికల్ యాక్టివిటీని) రికార్డు చేస్తుంది. తద్వారా వైద్యులు సైతం గుర్తించలేని రహస్య ఆరోగ్య సమస్యలను గుర్తించగలుగుతుంది. ఏఐ-ఈసీజీ రిస్క్ ఎస్టిమేషన్ లేదా ఏఐఆర్‌ఈ అని పిలిచే ఈ ప్రోగ్రామ్.. 10 ఏండ్లలో సంభవించనున్న మరణాల ముప్పును ఈసీజీ పరీక్ష ద్వారా 78% కచ్చితత్వంతో గుర్తించగలుగుతున్నట్టు పరిశోధనల్లో తేలింది. బ్రిటన్‌లోని హాస్పిటళ్లు ఈ



డెత్ కాలిక్యులేటర్‌ను ఉపయోగించేందుకు సిద్ధమవుతున్నాయి. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ హెల్త్‌కేర్ ఎన్‌హెచ్‌ఎస్ ట్రస్టు సహా రెండు ఎన్‌హెచ్‌ఎస్ ట్రస్టుల్లో వచ్చే ఏడాది నుంచి పరీక్షించనున్న ఈ సాంకేతికతను ఐదేండ్లలోగా బ్రిటన్‌లోని అన్ని హాస్పిటళ్లలో ఉపయోగించాలని నిపుణులు భావిస్తున్నారు. వైద్యుల స్థానంలో సాంకేతికతను ప్రవేశపెట్టాలన్నది ఏఐఆర్‌ఈ లక్ష్యం కాదని, మానవాతీతమైనదాన్ని లేదా సూపర్‌హ్యూమన్‌ను సృష్టించడమే ఏఐఆర్‌ఈ లక్ష్యమని ఇంపీరియల్ కాలేజీ హెల్త్‌కేర్ ఎన్‌హెచ్‌ఎస్ ట్రస్టు కార్డియాలజీ రిజిస్ట్రార్ డాక్టర్ అరుణాశిష్ సా తెలిపారు.